నవతెలంగాణ
ఆదిలాబాద్
శుక్రవారం | నవంబర్ 22, 2024 | www.navatelangana.com

యోగా సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని చిర్రకుంట గ్రామంలోని యోగా సెంటర్‌ను మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఎన్నో రకాల ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఆరోగ్య రక్షణకు యోగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ పాల్గొన్నారు.



ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు ఫసిఉద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ప్రతినిధుల బృందం ఆస్పత్రిని సందర్శించి సమస్యలు తెలుసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా, ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఆసుపత్రిని సందర్శించిన బృందంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ద్యావత్ పోశెట్టి, పట్టణ కార్యదర్శి శంబు, ఆత్రం ధర్మ, జలీమ్‌రావు, సలీమ్ పాల్గొన్నారు



ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయుల ప్రయోజనాలు, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ రెండు కళ్లుగా అనునిత్యం పోరాడే సంఘం టీఎస్‌యూటీఎఫ్ అని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వరగంటి అశోక్ అన్నారు. గురువారం పట్టణంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బేలా మండల నూతన కమిటీ ఎన్నిక

పట్టణంలోని డైట్ కళాశాలలో టీఎస్‌యూటీఎఫ్ బేల మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టి.సూర్యకుమార్, పరిశీలకులుగా వి.అశోక్ వ్యవహరించారు. బేల మండల నూతన అధ్యక్షులుగా సి.అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాందేవ్‌ను ఎన్నుకున్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు చిన్ననాటి నుండి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయ్‌బాబు అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించే మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్ష ప్రశ్నపత్రాన్ని జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి వడ్లూరి రాజేష్, సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సంతోష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. ఈ బాధ్యతను స్వీకరించి అవిరాళ కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక బాధ్యులను అభినందించారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని కల్గి ఉండాలని, సైన్స్‌లో ప్రావీణ్యత పెంచుకోవాలని, శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలనాసక్తిని పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లూరి రాజేశ్ మాట్లాడుతూ సామాన్య ప్రజానీకంలో శాస్త్ర ప్రచారం చేస్తూ రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజలు అలవర్చుకొనేందుకు కృషి చేస్తున్న సంస్థ జన విజ్ఞాన వేదిక అని, 'ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, శాంతి కోసం సైన్స్, దేశం కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్, పర్యావరణ పరిరక్షణ కోసం సైన్స్' అనే నినాదాలతో పని చేస్తున్నామని తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో వచ్చిన వారికి ఈ నెల 28న నిర్వహించే జిల్లా స్థాయిలో పరీక్ష ఉంటుందన్నారు.

26న నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు ఈ నెల 26న జిల్లా కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ తెలిపారు. గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు డి.పోశెట్టి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గైని మురళీమోహన్, నిర్మల్ మండల అధ్యక్షులు బర్కుంట గంగారాం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం రాజేష్ పాల్గొన్నారు.

తెలంగాణలో బోనస్ పండగ

నవతెలంగాణ-ఖానాపూర్

సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అప్పట్లో భూస్వాములకు రైతుబంధు లభించేదని, ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తూ తెలంగాణలో బోనస్ పండుగ కొనసాగుతుందన్నారు. సన్నం రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ అందించడం పట్ల ఎకరాకు దాదాపు రూ.10వేల లాభం చేకూరుతుందన్నారు. బోనస్ ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. రైతుల తరపున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

శతశాతం కంప్లీట్..!

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పూర్తయిన పనులు
- సర్కారు బడులకు సమకూరిన ఆధునిక హంగులు
- పేద విద్యార్థులకు చేకూరిన మౌళిక వసతులు
- పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వానికి విజ్ఞాపన

సర్కారు బడులకు ఆధునిక హంగులు అద్దారు. ఇన్నాండ్లు సౌకర్యాల లేమితో సతమతమైన పాఠశాలలు నూతన ఒరవడిని సంతరించుకున్నాయి. ప్రయివేటు పాఠశాలల మాదిరిగానే సర్కారు బడులను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం వీటిపై ప్రత్యేక దృష్టిసారించింది. గతంలో ఉన్న మన ఊరు- మనబడి స్థానంలో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీలను బాగు చేయాలని నిర్ణయించింది. వీటిలో మౌళిక వసతుల కోసం ప్రత్యేకంగా నిధుల కేటాయించింది. ఈ ఏడాది మార్చిలో ప్రారంభించిన పనులు ఆగుతూ సాగినా.. ప్రస్తుతానికి శతశాతం పూర్తిచేసుకున్నాయి. సర్కారు బడుల్లో మౌళిక వసతులు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటుకు ధీటుగా సౌకర్యాలు కల్పించడంతో రానున్న ఏడాది మరిన్ని ప్రవేశాలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడులు అనగానే సౌకర్యాలు ఉండవు..కూర్చోవడానికి కుర్చీలు..తాగేందుకు నీళ్లు లభించవనే అభిప్రాయం ఉండేది. వీటికి తోడు మరుగుదొడ్లు లేకపోవడం..శిథిల భవనాల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వీటిలో అధిక భాగం పేద, మధ్య తరగతి విద్యార్థులే చదువుకుంటున్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఇప్పటికీ సర్కారు బడులే విద్య నేర్పిస్తుంటాయి. ఇలాంటి బడుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించేవి. వీటిని బాగు చేయాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం మన ఊరు- మనబడి- బన బస్తీ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ప్రతి ఏటా 25శాతం బడులను అభివృద్ధి చేయాలని భావించింది. తొలుత పనులు సాగినా..నిధుల లేమి కారణంగా ఈ పనులు ఎక్కడికక్కడే అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అంతలోనే రాష్ట్రంలో ప్రభుత్వం దిగిపోవడం.. కొత్త సర్కారు కొలువు దీరడం వెంటనే ప్రభుత్వ పాఠశాలలపై దృష్టిసారించింది. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరి 8న అధికారికంగా ప్రారంభించినా పనులు మాత్రం మార్చిలో ప్రారంభమయ్యాయి. తొలుత ఎస్ఎంసీల స్థానంలో స్వయం సహాయక సంఘాలతో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటుచేసి వాటికి పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన బాధ్యతలు అప్పగించింది.



అందుబాటులోకి మౌళిక వసతులు..!

ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట చేపట్టిన అభివృద్ధి పనులు ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో పూర్తయ్యాయి. జిల్లాలో 678 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో ఇది వరకే మన ఊరు- మన బడి కింద పనులు పూర్తయిన 16 బడులతో పాటు మరో పది విద్యార్థులు లేని పాఠశాలలు, మరో 3 అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిని మినహాయించి 649 బడులను ప్రభుత్వం ఈ ఏడాదిలో పూర్తిచేయాలని నిర్ణయించింది. తొలుత తాగునీటి వసతి, రెండు రకాల మైనర్ రిపేర్లు, మరుగుదొడ్లకు మరమ్మతులు, విద్యుద్దీకరణతో పాటు బాలికల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం వంటివి చేపట్టారు. ఇందుకు రూ.25.50కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా.. ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేసింది. ఇప్పటి వరకు రూ.18.50కోట్ల వరకు బిల్లులను పనులు చేపట్టిన వారి ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మిగితా బిల్లుల కోసం ప్రభుత్వానికి విజ్ఞాపన చేసినట్లు చెబుతున్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ..ఉన్నతాధికారుల ప్రత్యేక దృష్టి ఫలితంగా ఈ ఏడాది పనులను పూర్తి చేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా సర్కారు బడులు నూతన హంగులతో అందంగా కనిపిస్తున్నాయి. ప్రయివేటు పాఠశాలల మాదిరిగానే వీటిలోనూ సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అన్ని పాఠశాలల్లో పనులు పూర్తి : నారాయణ, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి, ఆదిలాబాద్

అమ్మ ఆదర్శ పాఠశాల కింద పరిగణనలోకి తీసుకున్న 649 బడుల్లో వివిధ రకాల సౌకర్యాలు కల్పించాం. జిల్లా ఉన్నతాధికారుల దిశానిర్దేశంతో ప్రస్తుతం అన్ని బడుల్లోనూ పనులు పూర్తయ్యాయి. విద్యార్థులకు మౌళిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. రానున్న రోజుల్లో సర్కారు బడుల్లోనూ ప్రవేశాలు మరింత పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది.

పేదల బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

- తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం
- రాష్టానికి 54 ట్రామా సెంటర్‌లు
- ఐకాన్ సిటీగా మంచిర్యాల
- వైద్యారోగ్య శాఖా మంత్రి దామోదర రాజనరసింహ



నవతెలంగాణ-మంచిర్యాల

నిరంకుశ పాలనకు చరమగీతం పాడి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని, పేద ప్రజలకు అవసరమైన విద్యా, వైద్యం ఉచితంగా అందించడమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో రూ.360కోట్లతో నిర్మించబోయే 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ చుట్టూ పక్కల మూడు రాష్ట్రాలు, 7నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడేలా మంచిర్యాలలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. పేద ప్రజల కొరకు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. ఎమ్మెల్యే చొరవతో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణలో మొత్తం 54 ట్రామా సెంటర్‌లు మంజూరు చేస్తామని, గ్రామీణ ప్రాంతాలకు అంబులెన్సు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విస్తరించి వాటిల్లో బెడ్ల సంఖ్యను పెంచుతామన్నారు. 6 బెడ్స్‌తో ఉన్న జన్నారం పీహెచ్‌సీని 30బెడ్స్ ఆస్పత్రిగా మారుస్తామని తెలిపారు. జిల్లాకు సరిపడా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తల కొరత లేకుండా చూస్తామన్నారు. జిల్లాలో క్యాన్సర్, ట్రామా, వాస్క్యులర్ సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. సింగరేణిలో పని చేసే రెగ్యులర్ కార్మికులతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా లాభాల్లో బోనస్ అందించామని, సింగరేణి బొగ్గు గనులను కాపాడడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేస్తుందని స్పష్టం చేశారు. ఇందిరా గాంధీ నాయకత్వంలో ఎంతో మంది పేద ప్రజలకు భూములు అందించామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చేసే అభివృద్ధి పనులకు నియోజకవర్గ ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ముందుకు పోతుందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా నవంబర్ 14 నుండి డిసెంబర్ 9వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ఏర్పడ్డ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే జిల్లాలో 650 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద రోడ్ల నిర్మాణం, దండేపల్లి మండలంలో నిర్మించే రెసిడెన్సియల్ స్కూల్ ఎమ్మెల్యే చొరవతో జిల్లాకు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని సామాన్య ప్రజలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో మందుల కొరత లేకుండా డ్రగ్ స్టోరేజీ సెంటర్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు కాస్మోటిక్స్, డైట్ చార్జీలు పెంచామని, రైతులకు రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ప్రజల సహకారంతో ముందుగు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ త్వరలోనే జిల్లాలో ఐటి హబ్, ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. హామీ ప్రకారం జిల్లాలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తున్నామని, పేద ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాను మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్నా లేకున్నా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంత్రి శ్రీధర్‌బాబు వెన్నుదన్నుగా నిలిచారని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ మంత్రి సహకారం జిల్లాకు ఉండాలని కోరారు. కాంగ్రెస్ పెద్దల ఆశీర్వాదంతో రాబోయే రోజుల్లో మంచిర్యాలను ఐకాన్ సిటీగా మారుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ చైర్మన్ కొట్నాక తిరుపతి, మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మెన్ జనక్ ప్రసాద్, మున్సిపల్ చైర్మెన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మెన్ సల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ సురిమళ్ల వేణు, టిజీఎంఎస్ఐడిసి ఎండి హేమంత్ బోర్కడే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య శాఖ అధికారి డా.హరీష్‌రాజ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సులేమాన్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీష్‌చంద్రారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వికలాంగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వికలాంగులకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు ఇస్లాం బిన్ హసన్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు పెన్షన్ రూ.4000కు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. సంవత్సరం పూర్తి కావస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకుంటుందని, ఇదే సందర్భంలో తమకు ఇచ్చిన హామీ మర్చిపోయిందన్నారు. వెంటనే హామీ నెరవేర్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూరం శ్రీనివాస్, రాజయ్య, మనోహర్, అన్నాజీ, మొండి, మహేష్ పాల్గొన్నారు.



వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి

ఆర్‌డీఓ వినోద్‌కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తున్నాయని ఆర్డీఓ వినోద్ కుమార్ అన్నారు. గురువారం సీనియర్ సిటిజన్ కార్యాలయంలో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వయోవృద్ధుల సమాఖ్య సహకారంతో డిజిటల్ గురుకుల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు చట్టాల గురించి తెలియజేశారు. వయోవృద్ధులు సివిల్ కోర్టుల్లో ఇబ్బందులు పడుతున్నారని గమనించి ప్రభుత్వం వారి కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆర్డీఓను చైర్మెన్‌గా నియమిస్తు సివిల్ కోర్టు అధికారులు ఇచ్చిందని తెలిపారు. కోర్టు అధికారులున్న ఇక్కడ న్యాయవాదులకు అవకాశం లేదన్నారు. వయోవృద్ధులు, తల్లిదండ్రులు తమ పిల్లల వేధింపులు ఇతర విషయాలపై ఆర్డీఓ కార్యాలయంలో తెల్లని కాగితంపై కూడా ఫిర్యాదు చెయొచ్చని తెలిపారు. చట్టాలు అనేకంగా ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అయితే ఇందులో వయోవృద్ధులకు చైర్మెన్ నిర్ణయంపై అప్పీల్ చేయడానికి అవకాశం ఉంటుందని, అదే పిల్లలకు ఉండదని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, కార్యదర్శి రాంకులకర్ణి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కంది లక్ష్మారెడ్డి, గుండా వామన్‌రావ్, కె.సుధాకర్, హన్మంత్‌రెడ్డి, నీలాకిషన్, ఆర్.కిషోర్ పాల్గొన్నారు.

ప్రజలకు వైద్యారోగ్య సేవలు అందించాలి

నవతెలంగాణ-బోథ్

ప్రజలు వైద్యారోగ్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని లక్ష్మి చైత్ర ప్రయివేటు ఆస్పత్రిని ఆయన చేతుల మీదుగా



ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆస్పత్రి వైద్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు రవీంద్ర ప్రసాద్, గౌతం, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మండల నాయకులు సురేందర్ యాదవ్, తహీర్, ఎలక రాజు, రమణగౌడ్, సుభాష్, ప్రవీణ్, బోడ లక్ష్మన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ మండలంలోని ఇటీవల భీంసరి గ్రామంలో కిడ్నీలు ఫెయిల్ అయి చనిపోవడం జరిగిందని విషయం తెలిసిన వెంటనే గురువారం ప్రవీణ్ కుటుంబాన్ని సామాజిక కార్యదర్శి ముడుపు మౌనిష్‌రెడ్డి కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్, కుమ్మరి రాజు, అంబదాస్, హన్మాండ్లు, దేవేందర్, నర్సింగ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆరోగ్య పాఠశాలపై కలెక్టర్ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరోగ్య పాఠశాల కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టూడెంట్ ఛాంపియన్స్‌లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం 14 నవంబర్ నుంచి కొనసాగుతుందన్నారు. కాగా వారం రోజులలో ఈ కార్యక్రమంపై గల అభిప్రాయాలను ప్రతి మండలం నుంచి ఒక పాఠశాల విద్యార్థి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి హాజరైన వారు గత వారంలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలను వివరించారు. వాటి నుంచి విద్యార్థులకు కలిగిన లాభాలు, పిల్లలలో కలిగిన మార్పులు అందరితో పంచుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పిల్లలు సొంతంగా పరిశుభ్రత అలవాట్లను అలవర్చుకోవడం మంచి శుభ పరిమణామన్నారు. ఈ కార్యక్రమాన్ని సహా పాఠ్యాంశాలలో భాగంగా చిరకాలం ఉండి పోయేలా చూడాలని, మరొక విద్యార్థి తెలియకుండానే ఒత్తిడికి గురై ఇప్పుడు తెలిసిన తర్వాత ఒత్తిడికి లోను కాకుండా క్రమశిక్షణతో కూడిన జీవనం కొనసాగిస్తే ఒత్తిడికి లోను కామని అన్నారు. అలాగే పిల్లలలో తంబాకు అలవాటు ఎక్కువగా ఉండేది అది ఇప్పుడు చాలమట్టుకు తగ్గిందని, ఈ కార్యక్రమం ద్వారా అవగాహన, క్రమశిక్షణ సంతులిత ఆహారము ఉన్నత విలువలతో కూడిన జీవనం మొదలగు విషయాల వల్ల మార్పు కలిగిందని మెరుగైన జీవనం కోరుకుంటున్నారని తెలిపారు. మరొక పాఠశాలలో విద్యార్థులు గుటుక తినే అలవాటును తాము తినమని వారంతట వారు వచ్చి ప్రేయర్‌లో ప్రతిజ్ఞ చేయడం జరిగిందని, ఇది వారిలో కలిగిన గొప్ప మార్పు అని కొనియాడారు. ఇలా ఆరోగ్య పాఠశాల కార్యక్రమలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 18 మండలాల నుంచి ఒక్కొక్క మండలం నుంచి ప్రధానోపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్, మలేరియా అధికారి శ్రీధర్, డీడబ్ల్యూఓ సబిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ పథకంతో ఆదివాసుల అభివృద్ధికి కృషి

- పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

దేశ వ్యాప్తంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ యోజన పథకం ప్రవేశ పెట్టిందని ఎంపీ గోడం నగేష్ , ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన పొతూగూడ, మొలల గుట్టలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పీఎం జన్‌మన్ యోజన పథకం ఆదివాసీ, గిరిజన గ్రామాలకు వరం లాంటిదని అన్నారు. ఈ పథకం ప్రవేశపెట్టిన మోడీకి మనమందరం రుణపడి ఉన్నామన్నారు. దేశవ్యాప్తంగా వెనుకబడిన గిరిజన గ్రామాల్లో యువత ఉపాధి కల్పించడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ప్రధానమంత్రి నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ సందర్భంగా రూ.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మండలాధ్యక్షుడు సంతోష్, దయాకర్, సుభాష్, అశోక్‌రెడ్డి, స్వామి, అశోక్, ముకుంద్, తుకారాం, ధరంపాల్ పాల్గొన్నారు.

మళ్లీ పులి భయంతో కూలీల పరుగులు

- అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు



నవతెలంగాణ-నార్నూర్

గత నాలుగు రోజుల కింద మండలంలోని ఆయా గ్రామాల శివారులో పెద్దపులి హల్‌చల్‌తో ప్రజలు భయబ్రాంతులకు గురైన విషయం తెలిసిందే. గురువారం మళ్లీ పులి భయంతో గుంజాల, తాడిహత్నూర్, తదితర గ్రామాలకు చెందిన కూలీలు, రైతులు పొలానికి వెళ్లగా పులి సంచరిస్తోందని పుకార్లతో ఉదయాన్నే ఇంటికి పరుగులు తీశారు. గుంజాల గ్రామంలో పొలానికి వెళు తున్న సమయంలో ఓ జంటకు పులి కనిపించిందని పులిని చూసి మహిళ స్పృహ కోల్పోయిందని పుకార్లు వినిపించాయి. గుంజాల, తాడిహత్నూర్, గంగాపూర్, మాన్యాపూర్ గ్రామ శివారులో పెద్ద పులి సంచరిస్తునట్టు పాదముద్రలు కనిపించినట్టు పలువురు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై నవతెలంగాణ అటవీశాఖ అధికారులకు వివరణ కోరగా స్థానికులు సమాచారం ప్రకారం గుంజాల గ్రామ శివారులో పరిశీలించామని పులి జాడ దొరకలేదని గాదిగూడ మండలంలోని ఖడ్కి, ఖాండవ్ గ్రామ శివారులో పులి సంచరిస్తున్నట్టు తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలనీ సూచించారు. పులి భయంతో పొలానికి వెళ్లడానికి రైతులు, కూలీలు భయబ్రాంతులకు గురవుతున్నారు.

బీజేపీలో నాయకత్వలేమి

- దిశానిర్దేశం లేక కార్యకర్తల్లో నైరాశ్యం
- ప్రశ్నార్థకంగా పార్టీ మనుగడ

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

నియోజకవర్గంలో బీజేపీకి ముందుండి నడిపే నాయకుడు లేక ఆపార్టీ పరిస్థితి ఆగమ్య గోచరంగా మారుతోంది. పార్టీలో దిశనిర్దేశం చేసే నాయకుడు లేక పోవడంతో కార్యకర్తలు నైరాశ్యంలో ఉన్నారు. దిగువ శ్రేణి అవకాశవాద నాయకుల తీరుతో పార్టీకి ఆదరణ తగ్గుతోందంటున్నారు. స్థానికంగా బీజేపీ అంటే ఎన్నికలప్పుడు మాత్రమే నలుగురు నాయకులు కనిపించి అటుతర్వాత ఏమి పట్టించుకోరన్న ప్రచారం ఉంది. ఆ విమర్శను చెరిపేసుకోవడంలో సదరు నాయకలు దృష్టి సారించక పోవడం గమనార్హం. గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆశాజనకంగా వచ్చిన ఓట్లను చూసి తమ పనితనంగా భ్రమలో ఉన్న నాయకులు తేరుకోకుంటే పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని విశ్లేషకులు అంటున్నారు. సెంటిమెంట్, మోడీ ప్రభావం ఎల్లప్పుడు పనిచేస్తుందనుకోవడం అజ్ఞానమే అవుతుందని పేర్కొంటున్నారు.

నాయకుడు లేని లోటు...

నియోజకవర్గంలో బీజేపీకి నాయకుడు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో నియోజకవర్గంలో అంతగా ప్రజాదరణ లేని పార్టీకి రెండేండ్ల క్రితం అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్ర, దివంగత నాయకుడు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ నాయకత్వం నియోజకవర్గంలో పార్టీ బల పడటానికి కారణమయ్యింది. ఈ క్రమంలో గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి పలువురు నాయకులు బీజేపీలో చేరారు. పార్టీ టికెట్‌ను ఆశించి చేరిన పలువురు టికెట్ రాక పోవడంతో వెంటనే పార్టీ ఫిరాయించారు. దివంగత నాయకుడు రాథోడ్ సారథ్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఆశించిన ఓటుబ్యాంకు సాధించింది. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు, రాథోడ్ రమేష్ మరణం ఖానాపూర్‌లో ఆ పార్టీకి సారథ్యం వహించే నాయకుడు లేని పరిస్థితి నెలకొంది.

సమన్వయలోపం...

పార్టీకి నాయకత్వం లేక దిగువ శ్రేణి నాయకుల్లో సమన్వయం లోపించినట్లు చెబుతున్నారు. పట్టణ, మండల, సీనియర్, జూనియర్ నాయకుల మధ్యన ఏకాభిప్రాయంలేక పార్టీకి నష్టం జరుగుతున్నట్లు పలువురు చెబుతున్నారు. పార్టీలో వివిధ పదవుల్లో ఉన్న నాయకులు ఎవరికి వారుగా వ్యక్తిగత అవసరాల కోసం పనిచేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఆయా కార్యక్రమాలకోసం పార్టీ ఫండ్ వచ్చిన సందర్భంలో మాత్రం నాయకులమని చెప్పుకొని పంపకాల హడావిడి చేస్తారన్న విమర్శలున్నాయి. పలువురు నాయకులు వారి వ్యాపార, ఆర్థిక లాభాల కోసం ఇతర పార్టీలతో అంటకాగడం చర్చానీయాంశమవుతోంది. ఈ పరిణామాలన్ని రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రభావితం చేస్తాయని పార్టీ కార్యకర్తలు పేర్కొంటున్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



నవతెలంగాణ-ఖానాపూర్

గంగపుత్ర మత్స్య పరిశ్రమ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ఖానాపూర్ పట్టణంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం అధ్యక్షులు పరిమి సురేష్ మాట్లాడుతూ ఖానాపూర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగపుత్రుల ఆరాధ్య దైవమైనటువంటి భీష్మ పిత పితామహుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పరిమి రమేష్, డైరెక్టర్లు గడ్డమీది రవి, గడ్డి సురేష్, లాలు, చంద్ర, విలాస్, గణేష్, పెద్దన్న, సురేష్, మధు, రాము, ప్రశాంత్, మదన్, రాహుల్, ప్రణయ్, రమేష్, భీమ్‌రావు, శ్రీనివాస్, శ్యామ్, కళ్యాణ్, ఎర్రన్న, స్వామి, నరేష్, భీమయ్య, లక్ష్మణ్, గంగన్న, నరేష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : మత్స్యకారులను ఆదుకునేలా ప్రభుత్వం కృషి చేయాలని గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అశోక్ అన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగపుత్ర శివాలయంలో అభిషేకంతో పాటు ఇతర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల అశోక్ మాట్లాడుతూ పట్టణంలోని ఖానాపూర్ చెరువులో గుర్రపు డెక్క పెరిగిపోవడంతో మత్స్యకారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. వంద శాతం సబ్సిడీపై ఇస్తున్న చేప పిల్లలను లక్ష్యానికి అనుగుణంగా వంద శాతం చెరువు, ప్రాజెక్టుల్లో వదలడం లేదన్నారు. జూన్, జూలై మాసంలో చేప పిల్లలు ఇస్తే అవి పెరుగుతాయన్నారు. కానీ నవంబర్ నెలలో వేస్తే పెరుగుదల ఉండదని ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. మత్స్యకారులకే డబ్బులు ఇస్తే తామే స్వయంగా చేప పిల్లలను తీసుకువచ్చి చెరువు, కుంటల్లో, ప్రాజెక్టులలో వదులుతామన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బొంపెల్లి భూమన్న, నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌టౌన్ : మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గంగపుత్ర సంఘం నాయకులు భీష్మ పితామహునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పరిమి సురేష్, రమేష్, భీంరావ్, గడ్డమీది రవి, లాలూ, చంద్రవిలాస్, గణేశ్, రాహుల్, ప్రణయ్, ఎర్రన్న, స్వామి, నరేష్, భీమయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : మండలంలోని కొండాపూర్‌లో ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం గంగపుత్రులు జెండా అవిష్కరించారు. మత్స్య సంపదపై ఆధారపడి ఎంతో మంది గంగపుత్రులు జీవనోపాధి సాగిస్తున్నారని వారు అన్నారు. అలాగే ప్రభుత్వం సబ్సిడి పథకాలను ప్రవేశపెట్టి తమను ఆదుకోవాలని గంగపుత్రులు కోరారు.



రైతే దేశానికి అన్నం పెట్టే పెద్దన్న

- సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సిరికొండ

రైతే దేశానికి అన్నం పెట్టే పెద్దన్నగా ప్రతి ఒక్కరూ భావిస్తారని, అటువంటి రైతులకు అనేక కష్టాలు ఉన్నాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సిరిసంపదల సొసైటీ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతే రాజు అని గొప్పలు చెప్పుకునే నేటి సమాజంలో రైతులకు అడుగడుగునా అనేక కష్టాలు ఉన్నాయని అన్నారు. పత్తి కొనుగోళ్ల విషయంలో తేమ పేరిట రైతులను దోచుకుంటున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించానని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మంచు ప్రభావం కొంత ఎక్కువగా ఉంటుందని, తేమ శాతం ఎక్కువగా ఉంటుందని అన్నారు. దీంతో పత్తికి తేమ శాతం ఎక్కువగా చూపిస్తుందని అన్నారు. 18 శాతం తేమ ఉన్న గానీ, రైతులకు గిట్టు బాటు ధర ఇవ్వాలనే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. సిరి సంపదల సొసైటీ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర ఇస్తారని అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. మండలంలో మంజూరైన 7గురు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గైక్వాడ్ బాలాజీ, పొన్న మాజీ సర్పంచ్ ఇంగోలె భీంరావ్ పాటిల్ కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు కైలాస్, శ్రద్ధ, సిరి సంపదల సొసైటీ చైర్మెన్ గొర్బండ్ ప్రకాష్, నాయకులు పెంటన్న, ఇక్బాల్, కృష్ణారెడ్డి, చౌహాన్ సూర్యకాంత్, కదం సూర్యకాంత్, మల్లారెడ్డి, లక్ష్మణ్, విజయ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ మాట నిలబెట్టుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్, ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి అన్నారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం నిర్మల్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో బొబ్బిలి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చెందిన మాల ప్రజాప్రతినిధులను రేవంత్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నాడని అన్నారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణను అనుకూలంగా తీర్పు ఇచ్చిన రోజు దాన్ని స్వాగతించి, ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణను వర్తింపజేస్తామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని అన్నారు. కానీ దాని విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ లేకుండానే 11062 టిచర్ పోస్టులను భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేశారని అన్నారు. అందుకోసం ఎమార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాలకు క్షేత్రస్థాయిలో నూతన కమిటీలు ఏర్పాటు చేసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అంబేకర్ సాయి చంద్, ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి బిక్కి మురళీకృష్ణ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బాలేకర్ నంద కుమార్, శనిగారపు రవి, ఎమార్పీఎస్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఆరేళ్లి మల్లేష్, చెన్నూరు సమ్మయ్య, కొండ్రు బ్రహ్మయ్య, ఎంఎస్పీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కాల్వ శరత్, నిర్మల్ జిల్లా నాయకులు కత్తి నవీన్, నల్లూరి అరుణ్ కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్, ఎగ్జిబిషన్ కోసం పాఠశాల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించే జిల్లా సైన్స్, ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ కోసం గురువారం నిర్మల్‌లోని సెయింట్ థామస్ పాఠశాలను జిల్లా విద్యాధికారి రామారావు పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఏసీజీఈ పద్మ, కస్తూర్బా గాంధీ సమన్వయకర్త సలోమి కరుణ, అధికారులు లింబాద్రి, వినోద్ కుమార్ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నవతెలంగాణ-నార్నూర్

మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్, తహసీల్దార్ రాజ లింగం సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని ప్రధానోపాధ్యాయునికి, భోజన కార్మికుని ఆదేశించారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో చెకుముకి సంబరాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల స్థాయి చెకుముకి సంబరాలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాల ధనోర(బి)కి చెందిన విద్యార్థులు పాల్గొన్నారని జలంధర్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను జిల్లా అధ్యక్షులు బండి సుభాష్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీర్ల గంగయ్య పాల్గొన్నారు.

మధుమేహ పరీక్షల క్యాంపు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మధుమేహ అవగాహన వారోత్సవంలో భాగంగా మూడో రోజు గురువారం బంగాల్‌పేట్ మహాలక్ష్మి టెంపుల్ సమీపంలో లయన్స్ క్లబ్ నిర్మల్ వారీ ఆధ్వర్యంలో బంగాల్‌పేటకు చెందిన 39 మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్మల్ అధ్యక్షులు కూనింటి చంద్ర మోహన్‌రెడ్డి, కోశాధికారి లక్ష్మి నారాయణగౌడ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | నవంబర్ 22, 2024 | www.navatelangana.com

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ అండ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పేద ప్రజల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ అండగ ఉంటుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని పదిమంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి అండగా నిలిచే సీఎంఆర్ఎఫ్ డబ్బుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, తెలిగాండ్ల సంఘం రాష్ట్ర నాయకుడు సందీప్ మురళి పాల్గొన్నారు.

సెక్యూరిటీ జీఎంకు సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సెక్యూరిటీ జనరల్ మేనేజర్ చంద లక్ష్మీనారాయణను ఏఐటీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలో ఉన్న పెండింగ్ సమస్యలు, ఎస్అండ్‌పీసీ డిపార్ట్‌మెంట్ సమస్యలపై గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఫిట్ కార్యదర్శి కందుల మల్లేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం ఆయనను సత్కరించి స్వాగతించారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిలు జూపాక రాజేష్, కే.కిరణ్ బాబు, డిజరాజయ్య, మారం శ్రీనివాస్, ఎస్అండ్‌పీసీ గోలేటి సహాయ కార్యదర్శి ఎస్కే జాంగిర్, నాయకులు రమేష్, పుట్ట అంజయ్య, రారాజు, ఎస్ గణేష్,గొర్ల శ్రీనివాస్, తపస్ మండల్, దశరథం జమీందార్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో సెక్యూరిటీ జీఎం పర్యటన



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో సెక్యూరిటీ జీఎం చందా లక్ష్మీనారాయణ గురువారం పర్యటించారు. మొదటిసారిగా ఏరియాకు వచ్చిన సందర్భంగా ఆయనను బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అధికారులతో కలిసి సన్మానించారు. అనంతరం ఆయన మూతబడిన ఎంవీకే 3 మైన్, డోర్లి1, డోర్లి2, ఏరియా వర్క్ షాప్, ఏరియా స్టోర్, ఖైరిగూడ ఓసీని సందర్శించారు. సిసి కెమెరాల ఏర్పాటు, పనితీరును పర్యవేక్షించారు. ఏరియా స్టోర్ వద్ద స్క్రాప్ డంప్ యార్డును చూసి సూచనలు చేశారు. ఏరియాలో సెక్యూరిటీపై సిబ్బందికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఉమాకాంత్, ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే, డీజీఎం (స్టోర్స్) శ్రీనివాస్ రావు, డీజీఎం (వర్క్ షాప్) కృష్ణమూర్తి, ఎస్ఈ (సివిల్) మదీనా భాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ ఇన్స్‌పెక్టర్లు రాజమౌళి, చంద్రయ్య పాల్గొన్నారు.

నాస్‌లో జిల్లాను అగ్రభాగాన నిలపాలి

- జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిసెంబర్ 4న 3, 6, 9 తరగతి వరకు నిర్వహించే జాతీయ సాధన సర్వేలో జిల్లాను అగ్రభాగాల నిలపాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుండి జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల స్థాయిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న జాతీయ సాధన సర్వే 3, 6, 9 తరగతులకు ఉంటుందని, దానిలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వర్తిస్తూ కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, అభ్యసన ప్రదీపికలను సమర్థవంతంగా వినియోగించుకొని అన్ని అభ్యసన సామర్థ్యాలు, ఓఎంఆర్ పత్రాల మీద విద్యార్థులకు పూర్తి అవగాహనను పెంపొందించాలన్నారు. పదవ తరగతికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని, మధ్యాహ్న భోజనం మెనూ పాటిస్తూ విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసి మినిమం టైం స్కేల్ ఇవ్వాలి



నవతెలంగాణ-రెబ్బెన

విద్యాశాఖ-సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి అప్పటి వరకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం ఎంఈఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్ర శిక్షలో అంకితభావంతో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల భావితరానికి బంగారు బాటలు వేసేది విద్య అయిన అదే శాఖలో పనిచేస్తున్న మేము కనీస ఉద్యోగ భద్రత లేకుండా ఉన్నామన్నారు. రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాత పరీక్ష ద్వారా కలెక్టర్ చైర్మన్ ఉన్న కమిటీ ద్వారా ఇంటర్వ్యూలలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఎంపికై పనిచేస్తున్నామని తెలిపారు. చాలామంది ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, స్థితి గతులను దృష్టిలో ఉంచుకొని సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ రెగ్యులర్ చేసి అప్పటివరకు మినిమం టైం స్కేల్ కల్పించాన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరావధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

24న భీం విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని పోతపల్లి గ్రామంలో ఈనెల 24న కుమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోండ్వాన ఆదివాసీ కోయా సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నన్న, సభాధ్యక్షుడు తలండి మధూకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీం జల్‌జంగల్ జమీన్ నినాదంతో పోరాటం చేశారన్నారు. హక్కుల సాధన కోసం భీం స్ఫూర్తిగా సాగాలన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆదివాసులతో పాటు ఇతర సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాజ్‌గోండ్ సేవా మండల అధ్యక్షుడు మడే మల్లేష్, ఉపాధ్యక్షుడు కొడప భుజంగరావు, మాజీ సర్పంచ్ మడప శ్రీనివాస్, నిర్వాహకులు మడే అర్జు, తొర్రెం సత్యనారాయణ, రమేష్, నవీన్, రాములు పాల్గొన్నారు.

స్థానిక వనరులతో స్వయం ఉపాధి

- మహిళ సంఘాలతో తేనె శుద్ధి కేంద్రం ఏర్పాటు
- మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా డీఆర్‌డీఏ ప్రణాళికలు

నవతెలంగాణ-వాంకిడి

స్థానికంగా లభించే వనరులతో మహిళలు స్వయం ఉపాధి పొందేల అవకాశం కల్పించేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర సమైక్య ఆధ్వర్యంలో తేనెశుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలను అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా మండల కేంద్రంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో తేనేశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల నుండి కొనుగోలు చేసి తేనెను శుద్ధి చేసి విక్రయిస్తున్నారు. దీంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు తేనె టీగల పెంపకం ఉత్పత్తి చేసేందుకు జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణీ, సిర్పూర్(టీ), జైనూర్ మండలాలలో ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన గ్రామాలలో 2022 మే, జూన్ నెలలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో సభ్యులకు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. శాస్త్రీయ పద్ధతిలో తేనె టీగలను పెంచడం, అందులోని తేనెను సేకరించే విధానాలపై హైదరాబాద్ నుండి వచ్చిన శిక్షకులు మెలకువలు నేర్పించారు.



మండలంలోని అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గ్రామ పెద్దలకు తేనె పెట్టెలను పంపిణీ చేశారు. వీటిని తమ పొలాలలో అణువుగా ఉన్న ప్రదేశంలో ఏర్పాటు చేసి తేనె ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఒక్కొక్క గిరిజన స్వయం సంఘాల నుండి కిలోకు 25 చొప్పున ఇప్పటి వరకు 25 క్వింటాళ్ల తేనెను కొనుగోలు చేశారు. శుద్ధి చేసిన తేనెను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గత ఆగస్టు 15 కంటే ముందు వరకు కిలో తేనెను రూ.500 చొప్పున విక్రయించగా ప్రస్తుతం రూ.600లకు విక్రయిస్తున్నారు. 50 గ్రాములు, 100 గ్రాములు, 250 గ్రాములు, 500 గ్రాములు, కిలో చొప్పున సీసాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు 25 క్వింటాళ్ల తేనెను శుద్ధి చేసి 15 క్వింటాళ్ల తేనెను విక్రయించారు.

ప్రభుత్వ సహకారంతోనే తేనె శుద్ధి కేంద్రం

మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర సమాఖ్య ఆధ్వర్యంలో తేనె శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ సంస్థ రూ.14.14 లక్షలతో నిర్వహణకు నిదులు మంజూరు చేసి రూ.3.50 లక్షలతో తేనెశుద్ధి కేంద్రాన్ని కొనుగోలు చేయగా రూ.ఏడు లక్షలతో గ్రామీణ మహిళల నుండి తేనె తెట్టెను కొనుగోలు చేశారు. అనంతరం తేనె ఉత్పత్తి చేసే విధానంపై, తేనె సేకలణ తదితర వాటిపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. దీంతో మహిళలకు ఆర్థికంగా లాభం చేకూరుతుంది.

ఆర్థికంగా ఎదిగేందుకు దోహదం

మహేష్, ఏపీఎం

తేనెటీగల పెంపకం, ఉత్పత్తితో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుంది. మండలంలో అటవీ ప్రాంతానికీ దగ్గరగా ఉన్న మహిళా సభ్యులకు తేనెటీగల పెంపకం, ఉత్పత్తిపై శిక్షణ ఇచ్చి ఒక్కొక్క సభ్యురాలుకు ఐదు పెట్టెలను పంపిణీ చేశాం. డబ్బాలలో సేకరించిన తేనెను మండల సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు చేసి శుద్ధి చేసిన అనంతరం మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు సభ్యులు 26 క్వింటాళ్ల కొనుగోలు చేసి 15 క్వింటాళ్ల తేనెను మార్కెట్‌లో విక్రయించారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి



ఆసిఫాబాద్ : జెండాను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాటం సాగిద్దామని తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సేర్ల మురళి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ముదిరాజ్ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. బీసీ(డీ)లో ఉన్న ముదిరాజులను బీసీ(ఏ)లో చేర్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజులు అన్ని విధాలుగా వెనుక పడ్డారని వారి సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వ కృషి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజుల సంఘం మండల అధ్యక్షుడు పులి సతీష్, నాయకులు రవి, రాజేష్, నరేశ్, బాలేష్, సాయిరాం, శంకర్, ఎన్.రవి, తిరుపతి పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలోని ఏటిగూడెం గ్రామంలో గురువారం మత్స్యకారుల దినోత్సవ సందర్భంగా ముదిరాజ్ జెండాను ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తునికి సురేష్ ఎగరవేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నెల్లి మహేష్, పంబాల సన్యాసి, శ్రీశైలం, రావణ్, తూనికి రాజేష్, ధోని నరేష్, నెల్లి మహేష్ పాల్గొన్నారు.



బెజ్జూర్ : జెండాను ఎగరవేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ప్రయివేటుకు ధీటుగా బోధనలు జరిగాలి



నవతెలంగాణ-కౌటాల

ప్రయివేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశలలు నడవాలని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. గురువారం మండలంలోని మొగడ్‌దగడ్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రార్థన సమయానికంటే ముందు సందర్శించారు. ఆ సమయంలో పాఠశాల ఉపాధ్యాయులు అందరూ కూడా ప్రార్థన సమయానికి పది నిమిషాల ముందే వచ్చి ఉన్నారు. పిల్లలు కూడా 88/91 మంది పిల్లలు పాఠశాల ప్రార్థన సమయానికి హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజన అందిస్తున్నారు. రాగి జావా కూడా పిల్లలకు అందిస్తున్నారు. ఇలాగే మండలంలోని ప్రతి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమయపాలన, మధ్యాహ్న భోజన మెనూ పాటించాలన్నారు. ఆశ్రమ ఉన్నత పాఠశాలను మొగడ్‌ధగఢ్‌ను సందర్శించారు. నాస్‌పై 9వ తరగతి పిల్లలను, వారి సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే నజరేత్ మిషన్, భారతి విద్యామందిర్ పాఠశాలలను సందర్శించారు. నాస్‌పై పిల్లలను సన్నదం చేయాలన్నారు.

ఓపెన్‌కాస్ట్‌కు మూడవ బస్సు నడిపించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్ కాస్ట్‌కు మూడవ బస్సును నడిపించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిమాండ్ చేసింది. టెండర్ అయిపోయిందని 45 రోజుల నుండి సింగరేణి కార్మికులను డ్యూటీకి తీసుకెళ్లే బస్సు నిలిపివేశారని వెంటనే బస్సులు ప్రారంభించాలన్నారు. గురువారం సంఘం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సింగరేణిలో ఎక్కడ లేని విధంగా కార్మికుల కోసం ఉచిత రవాణ సౌకర్యం ఖైరిగూడ ఓపెన్ కాస్ట్‌కు ఏర్పాటు చేయించామన్నారు. సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతో సరైన సమయానికి టెండర్ చేయకపోవడంతో బస్సు రద్దు అయిందన్నారు. అంబులెన్స్ లేదా ఇతర వాహనాలను ఉపయోగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. మూడవ బస్సును సింగరేణి, కాంట్రాక్ట్ కార్మికుల కోసం నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు చంద్రశేఖర్ సమ్మయ్య, కార్నాదం వెంకటేష్, ఆరం కిరణ్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, పిట్ కార్యదర్శి బొంగు వెంకటేష్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు, అసిస్టెంట్ పి కార్యదర్శి మారిన చందర్, కాయిత స్వామి పాల్గొన్నారు.



జోనల్ స్థాయి క్రీడల్లో గురుకుల విద్యార్థుల సత్తా



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ములుగు జిల్లా జాకారంలో ఈ నెల 11 నుండి 14 వరకు జరిగిన పదవ జోనల్ స్థాయి క్రీడా పోటీలలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అండర్ 14 కబడ్డీ ద్వితీయ, అండర్ 17 బాల్ బ్యాడ్మింటన్ ప్రథమ, అండర్ 17 ఫుట్‌బాల్‌లో ద్వితీయ, అండర్ 19 టెన్నికాయిట్‌లో ద్వితీయ బహుమతి పొందారన్నారు. అదేవిధంగా అథ్లెటిక్స్ విభాగంలో అండర్ 14 డిస్కస్ త్రోలో ప్రథమ బహుమతి, అండర్ 17 క్యాటగిరిలో 100 మీటర్స్ ప్రథమ, తృతీయ, 200 మీటర్స్ ప్రథమ, ద్వితీయ, 400 మీటర్స్ ప్రథమ, 5000 మీటర్స్ ద్వితీయ, డిస్కస్ త్రోలో తృతీయ, లాంగ్ జంప్‌లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు గెలుపొందారని తెలిపారు. అదేవిధంగా అండర్ 17 విభాగంలో ఆర్.అభిషేక్ (పదవ తరగతి) ఇండివిజువల్ ఛాంపియన్‌షిప్, అండర్ 17 అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ విజయం పట్ల ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ ఎస్.సుమన్, టి.గణేష్, పీడీ రఘు, పీఈటీ సుధాకర్, ఉపాధ్యాయులున్నారు.

రోడ్ల నాణ్యత పరిశీలన



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని రోడ్ల నాణ్యతలను హైదరాబాద్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ రాములు గురువారం పరిశీలించారు. బెజ్జూరు మండలంలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన బెజ్జూరు, ఎలుకపెల్లి-బి, కుంతలమానేపల్లి, ఏటిగూడ, డబ్బాగూడ రోడ్లను పరిశీలించారు. బీటీ రోడ్డుల నాణ్యత ప్రమాణాలు నమూనాలు సేకరించి ఉన్నతాధికారులకు అందజేస్తామని క్వాలిటీ కంట్రోల్ అధికారులు తెలిపారు. ఆయన వెంట ఐటీడీఏ ఏఈ భద్రుద్దీన్, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చైతన్య విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 25న మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 19 ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి గొడిసెల నికేతన్ ఎంపికయ్యారు. కాగా గురువారం ఆయనను కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కళాశాల కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ అప్పగింత



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పొగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురించి బాధితునికి సిర్పూర్ ఎస్సై కమలాకర్ అందించారు. మండలానికి చెందిన ఆడే విశ్వనాథ్ ఇడీవల తన మొబైల్ పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వార ట్రేస్ చేసీ గురువారం బాధితునికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా దొంగతనం అయిన పొగొట్టుకున్న మొబైల్ తిరిగి పొందే అవకాశం ఉందని, పొయిన ఫోన్ల గురించి ఫిర్యాదు చేయాలని సూచించారు.

గుట్కా పట్టివేత

నవతెలంగాణ-కెరమెరి

జైనూర్ మండలం శివ్‌నూర్ ఎక్స్ రోడ్డు వద్ద కారులో తరలిస్తున్న నిషేధిత గుట్కా పట్టుకున్నట్లు జైనూర్ ఎస్సై సాగర్ తెలిపారు. ఉట్నూర్ నుండి జైనూర్ మండలానికి కారులో గుట్కా ప్యాకెట్ల తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. రూ. 87,500 విలువ గల గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి ఉట్నూర్‌కు చెందిన మొహమ్మద్ ఫైజాన్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున మండలంలోని తపాలాపూర్ ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు గురువారం దుప్పట్లను పంపిణీ చేశామని హాస్టల్ వార్డెన్ గోపాల్ తెలిపారు. చలి వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతుండగా ఈ హాస్టల్లో ఉంటున్న 35 మంది విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించే దుప్పట్లను ఇచ్చామన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభకు కాకా కుటుంబం దూరం

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో నిర్మించబోయే ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణం శంకుస్థాపనకు కాంగ్రెస్ దివంగత నేత గడ్డం వెంకటస్వామి కుటుంబం హాజరవకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వైద్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరైన ఈ సభకు జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకట స్వామి, గడ్డం వినోద్‌లతో పాటు వివేక్ కుమారుడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరు కాకపోవడంతో జిల్లా ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. జిల్లా కాంగ్రెస్‌లో వర్గ విబేధాలు ఏర్పడ్డాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో గురువారం జరిగిన సభనే సాక్ష్యం అంటూ పలువురు ముచ్చటించుకున్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం అందించినప్పటికీ కాకా కుటుంబ సభ్యులు ఎవరూ సభకు హాజరు కాకపోవడంతో జిల్లా కాంగ్రెస్ నాయకులు అయోమయంలో పడ్డారు.

చట్టాలపై కేజీబీవీ విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు మహిళ సిబ్బందికి పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాలు, గంజాయి, డ్రగ్స్‌పై షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్, జిల్లా షీటీం, చైల్డ్ లైన్, సఖి సెంటర్ భరోసా సిబ్బంది గురించి వివరించారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు దగ్గరై సేవలు అందిస్తున్నామని ఏదైనా సమస్య ఉంటే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ డయల్ 1930, రామగుండం టీటీం నంబర్ 6303923700పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అంజిబాబు, షీటీం కానిస్టేబుల్ సతీష్, భరోసా సెంటర్ సిబ్బంది విజయ, పుష్పలత, చైల్డ్ లైన్ సిబ్బంది ఇందిరా, సఖి సెంటర్ సిబ్బంది రమ, స్పెషల్ ఆఫీసర్ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు బోర్ మోటార్ సామాగ్రి అందజేత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ధర్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బోర్ మోటార్, సామాగ్రిని కాంగ్రెస్ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ అందజేశారు. కొన్ని రోజుల నుంచి పాఠశాలలో నీటి బోర్ పాడవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఆయన దృష్టికి రావడంతో బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కు వివరించారు. దీంతో సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశాలతో పాఠశాలకు బోర్ మోటర్ దానికి సంబంధించిన సామాగ్రిని గురువారం పాఠశాలకు అందజేశారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు ప్రదీప్‌కు ధన్యావాదాలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, ముత్యాల రాజమౌళి, మేడ రాంచందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివాలి



నవతెలంగాణ-జన్నారం

పదవ తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని మంచిర్యాల ఇన్‌చార్జి డీటీడీఓ జె.అంబాజీ విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లోని విద్యార్థుల సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. టెన్త్‌లో మంచి రిజల్ట్ తీసుకురావాలని, రానున్న టెన్త్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక బద్ధంగా చదివించాలని సూచించారు. ఆయన వెంట మంచిర్యాల ఏసీఎంఓ రాజమౌళి, ప్రధానోపాధ్యాయుడు శివరాజం,హెచ్‌డబ్ల్యూఓ శాంతి ఉన్నారు.

కెరమెరిలో నిమోనియా సర్వే



నవతెలంగాణ-కెరమెరి

ఈ నెల 12న ప్రారంభమైన నిమోనియా సర్వే గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది కాలనీలోని ఐదేండ్లలోపు పిల్లలను పరిశీలించారు. జలుబు, జ్వరం ఉన్న పిల్లలకు సిరప్ అందజేశారు. అనంతరం ఫస్ట్ ఏఎన్ఎమ్ మల్లీశ్వరి నిమోనియాపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చలి కాలం ఐదేండ్లలోపు పిల్లలు నిమోనియా బారిన పడే అవకాశం ఉండడంతో తల్లిదండ్రులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమోనియా సర్వే ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎమ్ గంగా, హెల్త్ అసిస్టెంట్ వసంత్ రావు, అంగన్‌వాడీ టీచర్ గుణసుందరి, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

డిసెంబర్ 18 నుండి డైట్ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిప్లమ ఇన్ ఎడ్యుకేషన్‌లో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు డిసెంబర్ 18 నుండి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుండి 24వ వరకు పరీక్షలు కొనసాగుతాయని, విద్యార్థులు విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

బొగ్గు బ్లాకులపై కుట్రలను విరమించుకోవాలి

- సీపీఐ(ఎం) సంతకాల సేకరణ

నవతెలంగాణ-కాసిపేట



జన్నారం : సంతకాలను సేకరిస్తున్న నాయకులు

బొగ్గు బ్లాకులపై కేంద్రం కుట్రలను విరమించుకోవాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సోమగూడెం చౌరస్తా వద్ద పార్టీ ఆధ్వర్యంలో కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను వేలం పాటలో పెట్టి అదానీ, అంబానీలకు సింగరేణి సంస్థను కట్టబెట్టాలని చేస్తున్న కుట్రలను విరమించుకోవాలని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆటో ఓనర్స్, డ్రైవర్స్, చిరు వ్యాపారులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఏర్పాటుతో కోల్ బెల్ట్ ప్రాంతంలో వేలాది కుటుంబాలకు ఉపాధి దొరకదన్నారు. అనేక గనులు, డిపార్ట్‌మెంట్లు మూసివేతతో ఇప్పటికే వేలాది కుటుంబాలకు ఉపాధి కరువై పోయిందన్నారు. కొత్తగా బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం సింగరేణిక సంస్థకి ఇవ్వకుండా అదానీ, అంబానీలకే వేలం పాట పేరుతో ఇవ్వడం కోసం కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. సింగరేణి సంస్థ, కార్మిక వర్గం ఉండడంతోనే కోల్ బెల్ట్ ప్రాంతం మనుగడ కొనసాగుతుందని, అదానీ, అంబానీ సేవలో మునిగిపోయిన బీజేపీ మోడీ ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకొని బొగ్గు బ్లాక్‌ల వేలం పాటను రద్దు చేసి సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఆటో ఓనర్స్, డ్రైవర్లు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.



కాసిపేట : సంతకాలను సేకరిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

జన్నారం : బొగ్గు బ్లాక్లను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరుతూ సీపీఐ(ఎం) మండల నాయకులు ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఫోన్కాల్ గ్రామంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండగొర్ల లింగన్న, కవ్వాల్‌లో మండల నాయకుడు అంబటి లక్ష్మణ్, కొత్తపేట గ్రామపంచాయతీలో నాయకులు దాసన్న రాజన్న వేరువేరుగా ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. రాష్ట్రానికి ఆయువుపట్టుగా ఉన్న సింగరేణి సంస్థను కాపాడుతూ ఆ సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వేల కోట్ల లాభాలు గడిస్తున్న సింగరేణి సంస్థ, ప్రతి సంవత్సరం కేంద్రానికి, రాష్ట్రానికి డివిడెంట్ రూపంలో ఫండ్ చెల్లిస్తుందన్నారు. ఎటువంటి పెట్టుబడి లేకుండానే ఆదాయం సమకూర్చుతున్న సంస్థను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయమంటే అక్రమ అరెస్టులా..?

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆస్పత్రి భవనానికి శంకుస్థాపనకు రాష్ట్ర మంత్రులు వస్తున్న నేపథ్యంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్‌ను లక్షెట్టిపేట పోలీసుల ముందస్తుగా అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులను సీఐటీయూ మంచిర్యాల జిల్లా కమిటీ ఖండించింది. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, స్కీం వర్కర్లు ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజనం కార్మికులు, అసంఘటితరంగా కార్మికులు, గ్రామ పంచాయతీ, మున్సిపల్, ఐకేపీ వీఓఏ, పశుమిత్ర, స్కూల్ స్వీపర్స్, వివిధ శాఖలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులు నిత్యం శ్రమదోపిడి గురవుతున్నారన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత,పెన్షన్ ప్రమాద భీమా తదితర సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే పలు మార్లు రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చిన ఎక్కడి గొంగడి అక్కడే అనే చందంగా ప్రభుత్వ విధానలున్నాయని మండిపడ్డారు. ప్రధానంగా శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని, ఆయా హాస్టల్ వర్కర్లకు, ఏఎన్ఎంలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, కార్మికులందరికి ప్రతి నెల నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికుల శిక్షణలిస్తాం

- మంచిర్యాల లేబర్ అధికారి రామ్మోహన్‌రావు



నవతెలంగాణ-జన్నారం

భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు కుట్టు మిషన్లతో పాటు కంప్యూటర్ విద్యను కూడా ఉచితంగా అందిస్తామని మంచిర్యాల జిల్లా లేబర్ అధికారి రామ్మోహన్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు ఇస్తున్న ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించారు. దీనికి సహకరించిన భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్కల ప్రభాకర్‌ను అభినందించారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు పదవ తరగతి చదివిన వారికి ఐటిఐలో ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలు ఉచిత కంప్యూటర్ విద్యను నేర్చుకొని అందులో ప్రావీణ్యం సాధించి ఉద్యోగాలు సాధించాలన్నారు. కుట్టు మిషన్ నేర్చుకున్న వారు ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న స్కూల్ డ్రెస్సులను కుట్టుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం ఆయనను ముల్కల ప్రభాకర్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఎంఈఓ వెంకటేశ్వర స్వామి

నవతెలంగాణ-కాసిపేట



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర స్వామి సూచించారు. గురువారం మండలంలోని దేవాపూర్ ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజన వంట నిర్వాహణను ఎంఈఓ వెంకటేశ్వర స్వామి పరిశీలించారు. వంట నిర్వహణ, మెనూ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వంట చేయాలన్నారు. కార్యక్రమంలో కాసిపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం సాంబమూర్తి, సీఆర్పీ మంతెన రమేశ్ ఉన్నారు.



రూం టూ రీడ్ లైబ్రరీ ప్రారంభం

మండలంలోని దేవాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రూం టూ రీడ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని ఎంఈఓ వెంకటేశ్వర స్వామి ప్రారంభించారు. రూమ్ టూ రీడ్ ప్రోగ్రాంలో విద్యార్థులకు కనీస సామర్థ్యాలు నేర్చుకునేందుకు ఎంతో దోహదపడుతుందని ఎంఈఓ అన్నారు. పాఠశాలలో ప్రతి తరగతిలో బుక్ రీడింగ్ పిరియడ్ ఉండే విధంగా ప్రణాళిక చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో దేవాపూర్, కాసిపేట, ధర్మరావుపేట కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రాథోడ్ రమేష్, సాంబమూర్తి, సుధాకర్ నాయక్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమాదేవి, రాజేశ్వరి, సంధ్య, రూమ్ టు రీడ్ కోఆర్డినేటర్ రాము, తిరుపతి సీఆర్పీలు మంతెన రమేశ్, మడావి తిరుపతి పాల్గొన్నారు.

కొనుగోలు పారదర్శకంగా నిర్వహించాలి



నవతెలంగాణ-జన్నారం

వరి కొనుగోలు కేంద్రాలను పారదర్శకంగా నిర్వహించాలని తహశీల్దార్ రాజ మనోహర్ రెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఓ సంగీత, ఏపీఎం బుచ్చన్న, ఆర్ఐ భానుచందర్, ఏఈఓ త్రిసంధ్య పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రపంచ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా లక్ష్మీ, డీఈఓగా చరణ్, అటెండర్లుగా షరీఫ్ వ్యవహరించారు. అనంతరం స్వయం పాలన దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులుగా, వివిధ పాత్రల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ సునంద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమగూడెంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి మండలంలోని సోమగూడెం భరత్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో ఎస్డీఎఫ్ పథకం కింద రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ముత్తె భూమయ్య, గోమాస భీమయ్య, దూడం మహేశ్, జైన శ్రీనివాస్, పాన్నాల కనక రాజు, దుర్గం గోపాల్, రాకేశ్, శ్యాం బాబు, రామస్వామి, సురేశ్, సాంబయ్య దుర్గ, నారాయణ పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనలో జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మంచిర్యాల జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భూమి పూజకు వచ్చిన రాష్ట్ర ఆరోగ్య మంత్రి, పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి పర్యటనలో జిల్లా నాయకులు హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా నుండి పెద్ద ఎత్తున నాయకులు ప్రజలు తరలివెళ్లారు. సభకు వెళ్లిన నాయకుల్లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రైతు అధ్యక్షుడు మారుతి పటేల్, నాయకులు శంకర్, బాలేష్, జక్కన్న, అసద్, మునీర్ ఉన్నారు.

ఆర్యవైశ్య నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాచకొండ నాగేశ్వర్ రావు సమక్షంలో ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గణపురం సంతోష్, ప్రధాన కార్యదర్శిగా రావుల కృష్ణ, కోశాధికారిగా చిలువేరు భాస్కర్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను ప్రస్తుత అధ్యక్షుడు సముద్రాల రాజన్న, ప్రధాన కార్యదర్శి రాచకొండ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

23, 24 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఓటర్ జాబితా సవరణ 2025లో భాగంగా ఈనెల 23, 24వ తేదీల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు కోసం సవరణ కోసం ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ లోకేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని, జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన అర్హత గల వారు నూతన ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6, సవరణలకు ఫారం-8, అభ్యంతరాలకు ఫారం-7 ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జిల్లా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రినీ రాత్రి సమయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలను ప్రత్యక్షంగ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరిండెంట్‌తో మాట్లాడి రోగుల సమస్యల పరిష్కరించే విధంగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో పేషంట్లకి అన్ని వసతులు కల్పించి, సరైన వైద్యం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షకు ఉచిత నమూనా పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ (ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు) యువతకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారిచే నిర్వహించబడుతున్న గ్రూప్-2 సర్వీసెస్ పరీక్షకు పూర్తిస్థాయి ఉచిత నమూనా పరీక్షలు నిర్వహించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆర్.రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, నమూనా పరీక్ష డిసెంబర్ 2, 3, 9, 10 తేదీలలో ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఉంటుందన్నారు. ఇతర వివరములకు 8500723745 నంబర్‌లో సంప్రదించవచ్చని, మైనారిటీ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సీఎంపీఎఫ్ పర్మినెంట్ అకౌంట్ ఇవ్వాలి



నవతెలంగాణ-రెబ్బెన

కన్వినియన్స్ డ్రైవర్లకు సీఎంపీఎఫ్ పర్మినెంట్ అకౌంట్ నంబర్లు ఇవ్వాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్షులు అంబాల ఓదెలు అన్నారు. గురువారం ఖైరిగూడ ఓసీ మైన్ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల ప్రకారం కొన్ని నెలల నుండి కన్వేనేన్స్ డ్రైవర్ల జీతాల నుండి కట్ చేస్తున్న సీఎంపీఎఫ్‌కు ఇప్పటివరకు పర్మినెంట్ అకౌంటు నెంబర్లు ఇవ్వకుండా డమ్మీ నంబర్ల పైననే కట్ చేస్తున్నారన్నారు. డమ్మీ నెంబర్లపై కట్ చేస్తున్న సీఎంపీఎఫ్ వివరాలు తెలుసుకునే అవకాశం డ్రైవర్లకు లేకుండా పోతుందన్నారు. ఖైరిగూడ ఓపెన్ కాస్ట్ మైన్ వెల్ఫేర్ ఆఫీసర్ వేణుని కలిసి సమస్యను తెలియజేయడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించి రెండు రోజులలో డమ్మీ నెంబర్లు అన్నింటిని గోదావరిఖని సీఎం ఆఫీస్‌కు పంపి పర్మినెంట్ నంబర్లు తెప్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో కన్వేనేన్స్ డ్రైవర్లు గణేష్, మహేందర్, వెంకటేష్, సంజీవ్, సదాశివ్, మహేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం



నవతెలంగాణ-కెరమెరి

ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుందారపు బాలకృష్ణ అన్నారు. గురువారం కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ప్రాథమిక సభ్యత్వాలు, క్రియాశీల సభ్యత్వాలను చేసిన బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ నుండి పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ వెంకట్ నాయక్, సీనియర్ నాయకులు రాజు నాయక్, మండల ప్రధాన కార్యదర్శులు రంగు శ్రీకాంత్, సేడ్మకి తుకారం, రాథోడ్ ఉత్తం నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షులు అలుగొట్టు నవీన్ కుమార్, వినోద్, రాథోడ్ విఠల్, నాయకులు పాల్గొన్నారు.

నీతి, నిజాయితీతో విధులు నిర్వర్తించాలి

- తెలంగాణ పీఅండ్ఎల్ ఐజీ రమేష్
- శిక్షణను పూర్తి చేసుకున్న 254 మంది కానిస్టేబుళ్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నీతి, నిజాయితీతో విధులు నిర్వర్తిస్తూ పోలీసు ఉద్యోగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని పిఅండ్ఎల్ ఐజి ఎం.రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీటీసీలో తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందిన ఆరు జిల్లాలకు చెందిన 254 మంది కానిస్టేబుళ్ల దీక్షత్ పరేడ్ గురువారం నిర్వహించారు. దీనికి ఐజీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు కలెక్టర రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, రెండవ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, శిక్షణ ఐఏఎస్ అభిజ్ఞన్, కానిస్టేబుల్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా ముఖ్యాతిథులు గౌరవ వందనం స్వీకరించి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ప్లాటూన్‌ల నుంచి ఐజీ వందనం స్వీకరించారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి మెమోంటోలను అందించారు. ఈ సందర్భంగా ఐజీ రమేష్ మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించకుండా రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ ప్రతి ఒక్కరూ విధులను నిర్వర్తించాలని తెలిపారు. పోలీసు సేవలో అందరూ భాగస్వాములై తమ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉన్నత స్థానాలను అధిరోహించాలని అన్నారు. తాను కూడా ఆదిలాబాద్ జిల్లాలో శిక్షణ తీసుకున్నట్లు గుర్తు చేశారు. త్రివర్ణ పతాకం సాక్షిగా చేసిన ప్రమాణాన్ని విధులు నిర్వర్తిస్తున్న సమయంలో గుర్తు చేసుకుంటూ నిష్పక్షపాతంగా, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా, సమన్వయంతో విధులను నిర్వర్తించాలని సూచించారు. పోలీసు ఉద్యోగంలో క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యమైన విషయమని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. అవినీతి ఆరోపణలు లేకుండా ప్రలోభాలకు గురికాకుండా విధులను నిర్వర్తిస్తే పోలీసు ఉద్యోగంలో విజయం సాధించినట్లని తెలిపారు. అధికారులు నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం అదనపు ఎస్పీ, శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ సి సమయ్ జాన్ రావు, అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, బి. సురేందర్‌రెడ్డి, ప్రకాష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వు సిబ్బంది పాల్గొన్నారు.



నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అండర్ 17 బాల బాలికల నెట్ బాల్ ఉమ్మడి ఆదిలాబాద్ జోనల్ స్థాయి పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సెక్రెటరీ బి.వెంకటేశం మాట్లాడుతూ నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ నుండి సుమారు 200 మందిపైగా విద్యార్థులు హాజరయ్యారని వారిలో ఉమ్మడి జిల్లా నుండి 12 బాలురు, 12 బాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 23 ఎస్జీఎఫ్ అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక శారీరక ఆరోగ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీడలకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని, దానిని వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు బీ.హరికృష్ణ, సీహెచ్ ఏడుకొండలు, స్వరూప, శ్రీవాణి, ప్రభాకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ మండలంలోని చాంద(టి) రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, ఏఎస్సై సునిత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చాంద(టి) జాతీయ రహదారిపై ఓవర్ లోడ్‌తో అతి వేగంగా వెళ్తున్న ఆటో చాంద(టి) గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడగా ఈ ఘటనలో ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలనికి చెందిన షేక్ మున్నాబి(53) అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులకు బహుమతులు



బోథ్‌లో..

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించారు. జన విజ్ఞానిక వేదిక జిల్లా నిర్వాహకులు బైరి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ హాజరయ్యారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో చదివే 8,9,10 తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ చిన్నతనం నుండే సైన్స్ పట్ల శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, మూఢనమ్మకాలను నమ్మవద్దని తెలిపారు. వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పరీక్ష నిర్వాహకులు బైరి సతీష్ కుమార్ మాట్లాడుతూ పిల్లల్లో సైన్స్ పట్ల అవగాహన పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కనుగుట్ట విద్యార్థులు శివవరప్రసాద్, అంజిత్, వివేక్, సొనాల విద్యార్థులు సాజియా, షాలిని, కేజీబీవీ, మోడల్ స్కూల్, ఆశ్రమ పాఠశాలలు విద్యార్థులు చంచల్, సాయిచందన, వర్షిణి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 28న ప్రభుత్వ డైట్ కళాశాల ఆదిలాబాద్‌లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు.

ఖానాపూర్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మస్కాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో మొదటిస్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనగిరి నరేందర్ తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ఎం.ఆదర్శిని, ఎం.గౌతం, ఎ.సాయిదత్తును అభినందించారు. ఈ కార్యక్రమంలో తొంటి శంకర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య, దీప్తి, శోభారాణి, షఫీ, విజయకుమార్, ఫరాజు, కిషన్, ప్రసాద్ పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన అభినందనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మూఢనమ్మకాలను తొలగించడంతో పాటు సైన్స్‌పై అవగాహన కల్పించేలా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ సోమయ్య అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ పరీక్షను లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులు పరీక్ష రాయగా, వారికి సూచలను చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సోమయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్ గురించి తెలియడం కోసం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు, విశ్వాసాలు పెరిగిపోయాయని తెలిపారు. వాటిని నివారించేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గతంలో జైనథ్ పాఠశాలలో దయ్యం ఉందనే అపోహలను తిప్పికొట్టేట్ల జేవీవీ నాయకులు అక్కడ రాత్రి నిద్రించి చూపించి భయాన్ని తొలగించారని గుర్తు చేశారు. విద్యార్థులు సైన్స్ గురించి తెలుసుకుంటూ ఇతరులకు కూడా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, పెంటపర్తి ఉశన్న, ప్రయివేట్ పాఠశాలల యాజమన్యాల సంఘం అధ్యక్షుడు రంగినేని పవన్‌రావ్, లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రన్సిపాల్ దేవేందర్ పటాస్కర్, జేవీవీ నాయకులు గంగన్న, లింగారెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు శశికాంత్, దయాకర్ రెడ్డి, గుండి మహేష్ పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్ : నిర్మల్ పట్టణ, గ్రామీణ మండలాల చెకుముకి పరీక్షలు గురువారం ఎన్టీఆర్ స్టేడియంలోని ఆడిటోరియంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరీక్ష ప్రశ్న పత్రాలను జిల్లా సైన్స్ అధికారి డా.వినోద్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ అవగాహన చేసుకొని ఆచరిస్తే ఉన్నత జీవనాన్ని పొందుతారని అన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు పరిష్కారం సైన్స్ చూపగలదని తెలిపారు. జన విజ్ఞానవేదిక ఆ దిశగా కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ పరీక్షలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని అధిక మార్కులు సాధించి 28న జరుగు జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలకు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ఆకుల సుదర్శన్, కొండా రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రఫీక్, గజపల్లి నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సేవలపై డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోస్టాఫీస్ సేవలపై డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ ద్వారా అవగాహన కల్పించడంతో పాటు సర్టిఫికేట్లను అందిస్తున్నామని ఉమ్మడి జిల్లా తపాల పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్దార్థ అన్నారు. 45 రోజుల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ముగ్గురు విద్యార్థులకు నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కలిసి గురువారం ధ్రువపత్రాలను అందజేశారు. అదనపు కలెక్టర్ ఇంటర్న్‌షిప్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐపీపీబీ తరపున డిజిటల్ లావాదేవిలను సులభతరం చేసేలా వ్యాపారస్తుల కోసం డాక్ సేవా క్యూఆర్ కోడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా తపాల పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్దార్థ మాట్లాడుతూ తపాల శాఖ తరపున డిగ్రీ ఫైనల్ ఈయర్ విద్యార్థులకు 45 రోజుల పాటు తపాలా సేవలపై అవగాహన కల్పించేలా ఇంటర్న్‌షిప్ ఇస్తున్నామన్నారు. డిగ్రీ కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు శివాణీ, శరణ్య, ప్రవళికలు 45 రోజుల పాటు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఇక్కడ సేవల గురించి తెలుసుకున్నారని తెలిపారు. అదే విధంగా డిజిటల్ లావాదేవిల్లో పోస్టాఫీసు కూడా అడుగుపెట్టిందన్నారు. వ్యాపారుల కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. పోస్టాఫీసుకు ఎక్కువ మంది వినియోగదారులు గ్రామీణప్రాంతాల నుంచే ఉన్నారని, వారికి ఎంతో సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐపీపీబీ మేనేజర్ రాజేష్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అతిక్ బేగం, అధ్యాపకులు చంద్రకాంత్, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎన్నికల ముందు దివ్యాంగులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని దివ్యాంగుల ఆత్మీయ సమితి జిల్లా అధ్యక్షుడు చందావార్ రాకేష్ అన్నారు. దివ్యాంగులకు ఆరు వేల పింఛన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమను ఆదుకోవాలని నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అధికారంలోకి రాక ముందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఆరువేల పింఛన్‌ను ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడుస్తున్న ఇప్పటి వరకు అందించలేదన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఉపాధి కోసం షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సతీష్, అబ్దుల్ సలీం, ప్రమోద్, రాజశేఖర్, రవి, నందు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన టీజీవీపీ నాయకులు

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ డీఈఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామారావును టీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొట్టూరి ప్రవీణ్ కుమార్ గురువారం డీఈఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ట్రస్మా సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు డీఈఓను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అబ్బాస్, నిర్మల్ టౌన్ ప్రెసిడెంట్ శ్రీధర్, టౌన్ సెక్రటరీ శ్యామ్, ట్రస్మా సభ్యులు ముజీబ్ ఖాద్రీ, సునీల్ కుమార్, శివ ప్రసాద్, నిర్మల్ టీజీవీపీ పట్టణ కన్వీనర్ దీక్షిత్, గణేష్, నాయకులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న నిర్మల్ వాసి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ మండలం మేడిపల్లికి చెందిన పొనుగోటి ప్రకాశ్‌రావును వరల్డ్ కల్చరల్ అండ్ ఎన్విరాన్మెంటల్ ప్రొడక్షన్ కమిషన్ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేసింది. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో నిర్వాహకుల చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేసినందుకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు అభినందించారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కడెం

మండలంలోని దిల్దార్‌నగర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ మాట్లాడారు. దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, ఎలగడప మాజీ ఎంపీటీసీ నర్సింగ్, రమేష్, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు శనిగారపు కమలాకర్, అబ్దుల్ రహీం, నరేష్, చంద్రశేఖర్, జగ్గారావు, కృష్ణారావు, నర్సయ్య, సుజీత్ రావు, రమేష్, రాజు, వెంకటరమణ, స్టీవెన్ మల్లేష్, సురేందర్ రావు, సతీష్, సత్తన్న కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నలుగురి బైండోవర్

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను గురువారం తహసీల్దార్ శివరాజ్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ నిర్మల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. ఈ నలుగురు వ్యక్తులను రెండు సంవత్సరాల పాటు బైండోవర్ చేసినట్టు తెలిపారు. బైండోవర్ అయినవారిలో లక్ష్మి , అశోక్, అనసూయ, లక్ష్మి ఉన్నారు.